ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8, కనిష్ఠం 20.2



పాల ఉత్పత్తిదారులకు క్యాన్ల పంపిణీ

తాడ్వాయి, జనవరి 30: మండలంలోని నందివాడ గ్రామంలో మంగళవారం కరీంగనర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు పాల ఉత్పత్తిదారులకు వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కరీంనగర్ డెయిరీ ప్రతిరోజూ 1000 లీటర్ల పాలను సేకరిస్తుందని తెలిపారు. ఒక్కో పాల ఉత్పత్తిదారుడికి మంచి ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘంలో ఇంటర్మీడియట్ టాపర్‌గా నిలిచిన గ్రామానికి చెందిన రుత్వికకు డెయిరీ చైర్మన్ రాజేశ్వర్ రూ.10వేల నగదు అందించారు.



లక్ష్యం చేరని సీఎంఆర్

- నేటితో ముగియనున్న 2022-23 వానాకాలం సీఎంఆర్ గడువు
- ఇప్పటికీ ప్రభుత్వానికి చేరని కస్టం మిల్లింగ్ రైస్
- ఇప్పటి వరకు 89 శాతం కేటాయింపు
- మరో 34,396 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ కేటాయించాల్సిన మిల్లర్లు
- జిల్లాలో జుక్కల్, బాన్సువాడ డివిజన్‌లోని మిల్లర్ల వద్దే సీఎంఆర్
- కస్టం బియ్యం ఇవ్వడంలో సాకులు చెబుతున్న మిల్లర్లు
- ఇప్పటికే పలువురు మిల్లర్లకు నోటీసులు జారీ చేసిన అధికారులు
- నేటిలోగా ఇవ్వకుంటే డిఫాల్ట్ లిస్టులోకి మిల్లులు

కామారెడ్డి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి కేటాయించాల్సిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) విషయంలో ఆయా మిల్లర్లు లక్ష్యాన్ని చేరడం లేదు. గత వానాకాలంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం జిల్లాలోని ఆయా మిల్లులకు కేటాయించారు. మిల్లర్లు ఈ ధాన్యాన్ని మర ఆడించి తిరిగి ప్రభుత్వానికి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి కేటాయించాల్సి ఉంటుంది. ఈ సీఎంఆర్ గడువు మూడు నెలల కిందటే ముగిసినప్పటికీ ఎఫ్‌సీఐ అవకాశం ఇస్తూ వచ్చారు. నేటితో గడువు ముగియనుంది. అయినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో పలు రైస్‌మిల్లుల నుంచి వానాకాలం సీఎంఆర్ ప్రభుత్వానికి చేరలేదు. 89 శాతం లక్ష్యాన్ని ఛేదించినప్పటికీ మిగతా సీఎంఆర్ కోసం అధికారులు ఆయా మిల్లర్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఆయా మిల్లర్లు ప్రభుత్వం మరోసారి గడువు ఇస్తుందని భావిస్తున్నారు. అయినప్పటికీ నేటితో ఆయా మిల్లర్లు సీఎంఆర్ తిరిగి ఇవ్వకుంటే ఆ రైస్‌మిల్లును డిఫాల్ట్ లిస్టులో పెట్టాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

జిల్లాలో 163 రైస్‌మిల్లులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 163 రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో 131 రా రైస్‌మిల్లులు ఉండగా మరో 32కి పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 557 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీనెల పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.46 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీనెల 5,450 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి ప్రతీ ఏటా రెండు సీజన్‌లలో రైతులు పండించే ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు పంపిణీ చేస్తుంటారు.

మిల్లుల్లోనే ధాన్యం

జిల్లాలో రెండు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోయింది. జిల్లాలో 2022-23లో వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి 4.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆయా రైస్‌మిల్లులకు కేటాయించారు. రైస్‌మిల్లర్లు మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి 3.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 2.83 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మరో 34,396 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలుచేసి మిల్లులకు కేటాయించారు. ఈ ధాన్యాన్ని మిల్లర్లు మర ఆడించి సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి 2.46 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి అప్పగించాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 48 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించారు. మరో 1.98 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లుల వద్దే ఉంది. అయితే యాసంగికి సంబంధించి మార్చి వరకు సీఎంఆర్ రైస్‌ను అప్పగించేందుకు మిల్లర్లకు అవకాశం ఉంది.

రైస్‌మిల్లులపై చర్యలు తీసుకుంటాం

● చంద్రమోహన్, అదనపు కలెక్టర్

గత వానాకాలం సంబంధించి సీఎంఆర్‌ను గడువులోపు ఇవ్వని రైస్‌మిల్లులపై చర్యలు తీసుకుంటాం. వానాకాలంకు సంబంధించి 89 శాతం సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించగలిగాం. మరో 11 శాతం మాత్రమే మిగిలి ఉంది. 34,396 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. ఇవ్వని మిల్లర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. గడువులోగా సీఎంఆర్ ఇవ్వకుంటే ఆ మిల్లులను డిఫాల్ట్ లిస్టులో పెడతాం.

వానాకాలం సీఎంఆర్ ఆలస్యంపై మిల్లులపై ఒత్తిడి

గత వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ గడువు ఇది వరకే ముగిసింది. అయితే మిల్లుల యాజమాన్యాలు కోరిన నేపథ్యంలో పలు మార్లు గడువును పొడిగించారు. గత సీజన్‌కు కూడా గడువు దగ్గర పడుతుంది. అయితే దీనికి మరోమారు పెంచేందుకు అవకాశం ఉండడంతో మిల్లుల యాజమాన్యాల జోలికి వెళ్లడం లేదని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని గోదాంలు ఖాళీ లేకపోవడం సీఎంఆర్‌తో నిండుగా ఉండడంతో మిల్లర్లు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో మిల్లులకు కేటాయింపు, వాటిని తిరిగి ఎఫ్‌సీఐ సేకరణ ప్రారంభంలో కొంత ఆలస్యం చోటు చేసుకుంది. దీంతో సీఎంఆర్ అప్పగించడానికి కొందరు వెసులుబాటు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. వానాకాలం, యాసంగి విషయంలో ఇప్పటికే ఆలస్యం అవడంతో అధికారులు మిల్లర్లు ఒత్తిడి పెంచుతున్నారు.

నేటితో ముగియనున్న గడువు

గత ఏడాది వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు ప్రభుత్వం కేటాయించింది. మిల్లర్లు మర ఆడించి సీఎం ఆర్ కింద 3.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంది. నేటి వరకు సీఎంఆర్‌ను ఇవ్వాలని ప్రభుత్వం మిల్లర్లకు గడువు ఇచ్చింది. ఇప్పటి వరకు 2.83 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను తిరిగి అప్పగించారు. 34,396 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. అయితే బుధవారం నాటికి గడువు ముగియనుంది. మరో నెలపాటు గడువు పొడిగిస్తారని మిల్లర్లు భావిస్తున్నారు. సమయం ఇవ్వకపోవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. సకాలంలో సీఎంఆర్‌ను అందించని పలు రైస్‌మిల్లు యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. గడువులోగా సీఎంఆర్‌ను ఇవ్వని మిల్లులను డిఫాల్ట్ లిస్టులో పెడతామని అధికారులు చెబుతున్నారు. మరోసారి వీరికి ధాన్యం కేటాయించడం ఉండదంటున్నారు. ప్రధానంగా జుక్కల్, బాన్సువాడ ఎల్లారెడ్డి డివిజన్‌ల పరిధిలోను 37 రైస్‌మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వలేక పోతున్నారని అధికారులు చెబుతున్నారు.

కార్మికుల కష్టాలు తీరేదెన్నడో?

- అధ్వానస్థితిలో కామారెడ్డి మున్సిపల్ కార్మికుల జీవనం
- నెలల తరబడి జీతాలు రాక అవస్థలు
- గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే పీఎఫ్ డబ్బులు
- తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కార్మికుల నిరసన
- మున్సిపల్ అధికారులతో మాట్లాడి జీతాలు అందేలా చూస్తామన్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కామారెడ్డి టౌన్, జనవరి 30: కోడి కూయకముందే విధులకు హాజరవుతూ తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఇంటి పరిసరాలలో పేరుకపోయిన చెత్తను శుభ్రం చేస్తున్న కార్మికులు కొందరైతే.. ప్రజలకు కావాల్సిన తాగు నీటిని, ఇతర అవసరాలను తీర్చే కార్మికులు మరికొందరు.. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సేవలందించేందుకు అధికారులకు చేదోడువాదోడుగా ఉంటూ చాలీచాలని జీతాలతో జీవనం కొనసాగించే సిబ్బంది ఇంకొందరు.. ఇలా ఏ విభాగంలో పని చేస్తున్నా తమకు అప్పగించిన విధులను సంపూర్ణంగా పూర్తిచేసే కార్మికులకు చేసిన పనికి వేతనాలు సమయానికి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కొట్టు మిట్టాడుతున్నారు. వారికి న్యాయంగా రావాల్సిన జీతాలను మాత్రం సకాలంలో అందించకుండా ఇతర అవసరాలకు మాత్రం అధికారులు, పాలకవర్గ సభ్యులు ఇట్టే వాడేస్తున్నారని ఎన్నిసార్లు రోడ్డెక్కినా, కార్యాలయం వద్ద నిరసనలు తెలిపినా వారికి మాత్రం తగిన న్యాయం జరగడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జీతాల కోసం నెలల తరబడి వేచి చూస్తూ అధ్వాన పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. అసలు ఇంతలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది ఎవరో కాదు కామారెడ్డి మున్సిపాలిటీలోని కార్మికులే. ఎన్నో సంవత్సరాల నుంచి రెండు, మూడు నెలలకోసారి జీతాలు చెల్లించడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గ్రహించిన ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి తన మొదటి మున్సిపల్ సమావేశంలోనే కార్మికుల జీతాలు చెల్లించాకే ఇతర అవసరాలకు జనరల్ ఫండ్‌ను వినియోగించుకోవాలని సూచించిన అధికారులు మాత్రం పెడచెవిన పెడుతునే వస్తున్నారు. దీంతో మంగళవారం తమను మీరే ఆదుకోవాలంటూ మున్సిపల్ కార్మికులంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి నేడు మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీతాల చెల్లింపులో జాప్యం

కామారెడ్డి మున్సిపాలిటీలో పని చేసే దాదాపు 450కి పైగా కార్మికులు, సిబ్బంది (సానిటేషన్ 315, వాటర్‌వర్క్స్ 118, ఇతర కార్యాలయ సిబ్బంది) పరిస్థితి అగమ్యగోచరంగానే ఉంటుంది. చేసిన పనికి తగిన జీతాలను చెల్లించాలని ఎన్నిసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినా అప్పటిమందమే కార్మికులను బుజ్జగించే ప్రయత్నంగా ఒకటో, రెండో నెలల జీతాలను చెల్లిస్తున్నారని ఆ తర్వాత మళ్లీ మిగిలిన నెలలు ఇదే పరిస్థితి నెలకొంటుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జీతాలు సరైన సమయంలో రాక ఇల్లు గడవక వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి కార్మికులకు ఏర్పడుతోంది. నెలల తరబడి జీతాలు రాకపోవడం వచ్చిన డబ్బులలో సగం వడ్డీలకే వెళ్తుండడంతో తాము ఆర్థికంగా ఇబ్బందికి గురవుతున్నామని కార్మికులు వాపోతున్నారు.

రెండేళ్లుగా పీఎఫ్ డబ్బులు జమ చేయని వైనం

మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి నెలకు రూ.16,600ల వరకు జీతాలను మున్సిపల్ అధికారులు చెల్లిస్తున్నారు. అయితే ఈ జీతాల్లోంచి రూ.14,600లు కార్మికులకు అందిస్తూ మిగిలిన రూ.2వేలను పీఎఫ్, ఈఎస్ఐలకు కట్ చేస్తున్నారు. అయితే ఈ పీఎఫ్, ఈఎస్ఐలను మాత్రం వారి పీఎఫ్ ఖాతాలో మాత్రం జమ చేయడం లేదు. ఇలా దాదాపు రూ.4 కోట్ల వరకు కార్మికుల డబ్బులు గత రెండు సంవత్సరాలుగా జమ చేయడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని దురదృష్టవశాత్తు ఏ కార్మికునికైన ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు అందాల్సిన బెనిఫిట్స్‌కు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అత్యవసర సమయాల్లో అభివృద్ధి పనులకు, కార్మికుల జీతాలకు, కార్యాలయ అవసరాలకు వినియోగించాల్సిన జనరల్ ఫండ్‌ను తమకు నచ్చిన విధంగా కేటాయిస్తూ కార్మికులకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పైగా కార్మికులకు జీతాలు చెల్లిస్తే తమకేంటి లాభం అనే ధోరణిని అటు అధికారులు ఇటు పాలకవర్గ సభ్యులు ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పీఎఫ్ డబ్బులు చెల్లించడం లేదు

● రాజనర్సు, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తమ జీతాల్లోంచి గత రెండు సంవత్సరాలుగా పీఎఫ్ డబ్బులు రూ.2వేల చొప్పున కట్ చేస్తున్నా ఇంత వరకు వాటిని జమ చేయలేదు. దాదాపు 4 కోట్ల వరకు పీఎఫ్ డబ్బులు బకాయిలు ఉన్నాయి. జీతాలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడమే కాకుండా తమకు న్యాయంగా రావాల్సిన పీఎఫ్ డబ్బులను కూడా అధికారులు జమ చేయడం లేదు. దురదృష్టవశాత్తు ఎవరైన కార్మికుడు మృతి చెందితే వారి కుటుంబానికి అందాల్సిన బెనిఫిట్స్ అందకుండా పోతాయి. తమకు ఎప్పటికప్పుడు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

ఎమ్మెల్యే చెప్పినా తీరు మార్చుకోని అధికారులు

తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పాలకవర్గ సభ్యులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో సూచించారు. ఎమ్మెల్యే చెబితే మేమెందుకు వింటామని అనుకున్నారో లేదంటే తమను ఎవరు అడుగుతారులే అనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో కానీ కార్మికుల ఇబ్బందులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే చెప్పిన అధికారులు తమ పద్ధతి మార్చుకోకపోవడంతో తమకు సరైన న్యాయం చేయాలని మంగళవారం నేరుగా మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఎమ్మెల్యే స్థానికంగా లేకపోవడంతో కార్మికులతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం మున్సిపల్ అధికారులతో మాట్లాడి జీతాలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి కదిలారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 30: ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు మూడు దఫాల్లో జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్‌లలో నిర్వహించబడతాయని తెలిపారు. అభ్యర్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14 వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు కామారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడలలో 50 కేంద్రాలలో నిర్వహించనున్నామన్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, వాటి నిఘాలో పరీక్ష పేపర్లు ఓపెన్ చేయాలన్నారు. నిబంధనల మేరకు ఓఎంఆర్ షీట్ విద్యార్థులకు అందజేస్తూ హాజరు రికార్డు చేయాలని అన్నారు. మాల్ ప్రాక్టీస్, మానవ తప్పిదాలు జరగకుండా చూడాలని, ఎటువంటి పరిస్థితినైన ఎదుర్కొనుటకు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల చుట్టు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం, ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మామిడి పూత



నాగిరెడ్డిపేటలో పూత పూసిన మామిడి చెట్టు

నాగిరెడ్డిపేట, జనవరి 30: మామిడి చెట్లు పూత పూసాయి. ప్రస్తుతం మామిడి చెట్లు పూతతో కళకళలాడుతున్నాయి. వాతావరణంలో మార్పులు, అధిక వర్షాలు, చలి తీవ్రత, పొగ మంచు ప్రభావం లాంటి వివిధ కారణాలు మామిడి పూతపై తీవ్ర ప్రభావం పడింది. ప్రతీయేటా సాధారణంగా నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడి చెట్లు పూత పూసి అవి పూతతో కళకళలాడతాయి. మామిడి చెట్లకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టకుండానే మామిడి పూత సీజన్ వచ్చిందంటే చాలు మామిడి చెట్లు పూతతో విరగబూస్తాయి. నవంబరు, డిసెంబరు మాసంలో మామిడి చెట్లు పూత కొచ్చి జనవరి మాసం చివరి వరకు పిందెలుగా మారి ఉగాది నాటికి ఆశించిన స్థాయిలో మామిడి పిందెలు పెరిగి మామిడి కాయలుగా మారతాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల దృష్ట్యా ఈసారి మామిడి చెట్లకు పూత ఆలస్యంగా వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జనవరి నెల ముగుస్తుండగా మామిడి చెట్లు పూత పూస్తున్నాయి. ఇంకా చాలా చెట్లకు పూత రావాల్సి ఉంది. జనవరి, ఫిబ్రవరి మాసంలో మామిడి చెట్లు పూత పూస్తున్నందున మామిడి కాత కాయడానికి ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆలస్యంగా పూత వస్తున్నందున మామిడి పంట దిగుబడి కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈసారి మార్కెట్‌లో మామిడి పండ్లకు ధరతో పాటు బాగా డిమాండ్ ఉండనుందని తెలుస్తోంది. మామిడిలో బంగినపల్లి, దసేరి, హిమాయత్, కేసరి, బేనిషాన్, చెరుకు రసం, పెద్ద రసాలు, తోతాపరి తదితర లాంటి మేలు రకమైన మామిడి పండ్లకు డిమాండ్ ఉండటంతో ఈ రకాలకు చెందిన మామిడి తోటలను జిల్లాలో రైతులు సాగు చేస్తున్నారు.

కాల భైరవ స్వామికి సింధూర పూజలు

రామారెడ్డి, జనవరి 30: మండలంలోని ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిధానంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్ గుప్తా, మాజీ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారికి పూజలు నిర్వహించిన దృశ్యం



వివాహేతర సంబంధంతోనే హత్య : డీఎస్పీ

తాడ్వాయి, జనవరి 30: తాడ్వాయి మండలం సోమారం గ్రామశివారులో ఈనెల 22న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు తెల్పారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కురుకంటి మనోహర్‌రెడ్డి పథకం ప్రకారం ముదాం శంకర్‌ను హత్య చేయించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన సూర్కంటి మనోహర్‌రెడ్డి మృతుడు ముదాం శంకర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. గత కొన్ని సంవత్సరాల నుంచి మనోహర్‌రెడ్డి మృతుడు భార్యలక్ష్మీతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మృతుడి భార్యలక్ష్మీ తన భర్త శంకర్‌ను అడ్డు తొలగించుకోవాలని ఎలాగైన హతమార్చాలని మనోహర్‌రెడ్డికి తెలిపింది. మనోహర్ రెడ్డి పక్క ప్రణాళికతో సోమారం గ్రామానికి చెందిన జింక శ్రీనివాస్, అతని భార్య యాదమ్మతో చర్చలు జరిపారు. శంకర్‌ను హతమారిస్తే మీకు పెద్ద మొత్తంలో డబ్బులు అందిస్తామని ఎర చూపారు. డబ్బులు అవసరమైన శ్రీనివాస్ ఈ ఒప్పందం కుదుర్చుకున్నాడు. పక్క ప్రణాళికతో ఈనెల 21న రాత్రి సోమారం శివారులోని సిద్దుల గుట్ట ప్రాంతానికి పిలిపించుకున్నాడు. జింక శ్రీనివాస్ అతని భార్య యాదమ్మలు కలిసి ఇనుపరాడ్డుతో తలపై కొట్టగా శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంతకముందే నేరస్తుడైన మనోహర్ రెడ్డి పథకం ప్రకారం ముందస్తుగా ముదాం శంకర్‌పై ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాడు. శంకర్ మృతిచెందితే రూ.50లక్షలు వరకు రావాలని ప్రణాళిక చేసుకున్నాడు. ఇందులో జింక శ్రీనివాస్‌కు డబ్బులు అందిస్తామని తెలిపారు. డబ్బులు కోసం ఆశపడ్డ శ్రీనివాస్ పథకం వేసుకుని హతమార్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు స్పెషల్ టీంలను ఏర్పాటుచేసి నిందితులను పట్టుకున్నామన్నారు. మంగళవారం కామారెడ్డి కొత్తబస్టాండ్‌ఏరియాలో నిందితులు తిరుగుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, వెంటనే వెళ్లి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. హత్యకేసులో సురకంటి మనోహర్ రెడ్డి, ముదాం లక్ష్మీ, జింక శ్రీనివాస్, జింక్ యాదమ్మలను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ రామన్, తాడ్వాయి ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

స్వాతంత్ర్య అమరవీరులకు ఘన నివాళి

నిజామాబాద్ అర్బన్, జనవరి 30: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళ్లు అర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్ర్యోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని దృఢ సంకల్పంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● 'అమరవీరుల సేవలు మరువలేనివి'

ఖిల్లా: స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు మరువలేనివని అదనపు డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీసు(లా అండ్ ఆర్డర్) జయరాం అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులైన వారి జ్ఞాపకార్థం పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ ఆదేశాల మేరకు పోలీసు పరేడ్ మైదానంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసి అసువులు బాసిన అమర వీరుల సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారికి మౌనం పాటించి నివాళ్లు అర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రొబేషనరీ ఐపీఎస్. బి.చైతన్యరెడ్డి, పోలీసు యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళ, ఆఫీసు సూపరింటెండెంట్‌లు, పోలీసు కార్యాలయ సిబ్బంది, సీసీఆర్‌బి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

గృహజ్యోతిని ఎప్పుడు అమలు చేస్తారు?

● మండల సర్వసభ్య సమావేశంలో నిలదీత

ధర్పల్లి, జనవరి 30: గృహజ్యోతి పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులను నిలదీశారు.మంగళవారం ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు నిరుపేదలకు 200ల యూనిట్ల విద్యుత్‌ను అందించే గృహజ్యోతి పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ఎంపీటీసీలు విద్యుత్ అధికారిని నిలదీ శారు. దుబ్బాక ఎంపీటీసీ గంగాధర్ మాట్లాడుతూ గ్రామంలో లైన్‌మెన్ విధుల్లో నిరక్ష్యం వహిస్తు న్నాడని సభ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుం టామని మండల సభకు వచ్చిన విద్యుత్ అధికారి లైన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. సర్పంచుల పదవి కాలం ముగియడం తో ఎంపీపీ సారికహన్మంతు, ఎంపీడీవో లక్ష్మణ్ వారిని సన్మానిం చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మాలతి మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

రోడ్డు విస్తరణ సర్వే పనుల పరిశీలన

ఆర్మూర్‌రూరల్, జనవరి30: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటా ర్మూర్ 63వ జాతీయరహదారి నుంచి లక్కోర గ్రామం వరకు చే పట్టనున్న విస్తరణ పనుల సర్వేను ఆర్డీవో వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భూసేకరణ ఏ మేరకు అవసర ముందో అన్న విషయంపై పరిశీలన జరిపారు.ఈకార్యక్రమంలో ఆర్మూర్ తహసీల్దార్ శ్రీకాంత్,పాల్గొన్నారు.

బోధన్‌లో కత్తిపోట్ల కలకలం

● ముగ్గురికి గాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

బోధన్ రూరల్, జనవరి 30: బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల అనీసా నగర్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి యువకుల మధ్య జరిగిన చిన్న పాటి ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసింది. పట్టణంలో అర్ధరాత్రి జరిగిన కత్తిపోట్లు కలకలం రేపాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆచన్‌పల్లిలోని అనీసా నగర్‌కు చెందిన సోహెల్, సోహెబ్‌లు అన్నదమ్ముళ్ళు. సోహెబ్‌కు అదే కాలనీకి చెందిన అబ్దుల్ వాసేతో చిన్న పాటి వివాదం చోటు చేసుకుంది. మాట్లాడు కుందామని అబ్దుల్ వాసే తన సన్నిహితుడు ఇలియాస్, తన్వీర్‌లతో కలిసి పిలిపించారు. మాట్లాడటానికి సోహెబ్‌తో పాటు సోహెల్ కూడా చేరుకున్నారు. వీరందరి మధ్య చిన్న పాటి వివాదం మొదలై కత్తి పోట్ల వరకు దారి తీసింది. ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగారు. ఇలియాస్ అనే వ్యక్తి కత్తితో సోహెల్ మీద దాడి చేయడంతో అతని వీపు వెనుక బాగం, షోల్డర్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో తన్వీర్ అడ్డుపడటంతో తన్వీర్ ఛాతి కింది భాగంలో కత్తితో గాయాలయ్యాయి. సోహెబ్‌కు సైతం గాయాల య్యాయి. కత్తి పోట్ల విషయం తెలుసుకున్న పోలీసు లు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రు లను చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసు పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో తన్వీర్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోహెల్ తీవ్రంగా గాయప డటంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. సోహెబ్‌ను చికిత్స అనంతరం ఇంటికి పంపిం చారు. ఘర్షణకు పాల్పడిన వారంతా 25 సంవత్సరాల లోపు ఉన్న యువకులే. వీరందరూ సెంట్రింగ్, ఇతర పనులు చేస్తుంటారు. యువకుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ కత్తి పోట్లకు దారి తీయడం తీవ్ర కలకలం రేపింది. బోధన్ సీఐ వీరయ్య కత్తి పోట్లకు గల కారణలను ఆరాతీస్తున్నారు. కత్తిపోట్లకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటా మని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. గాయపడ్డ యువ కుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.

● ఇదెక్కడి విష సంస్కృతి

చిన్నపాటి గొడవలు, వివాదాలు ఇలా కత్తిపోట్లకు దారి తీయడంపై పట్టణ ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి విష సంస్కృతిని యువత విడనాడాలి.తల్వార్, జంబియాలు వంటి మారణాయుధాలయు యువకుల వద్దకు ఎలా వస్తున్నాయని పోలీసులు అన్ని కోణాల్లో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. యువత సన్మార్గంలో కాకుండా ప్రమాదకర మార్గాల్లో పయణిస్తుం దన్నారు. యువత సమన్వయం కోల్పోయి ఇలా కత్తులతో పొడుచుకో వడం సరికాదని ఇదెక్కడి సంస్కృతి అని ప్రజలు వాపోతున్నారు. గత కొన్ని నెలల క్రితం బర్త్‌డే వేడుకల్లో తల్వార్‌లతో బోధన్‌లో కేక్‌లు కట్ చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.ఇలా యువత పక్కదారి పడుతోం ది. అల్లరి మూకలు,రౌడీలుగా తయారవుతున్నారు.ఇకనైనా పోలీసులు సంబంధిత శైలిలో యువకులను మేలు కోల్పాలని, విష సంస్కృతిని విడనాడేలా యువకులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేతికి వచ్చిన కొడుకులు ఇలా ఆసుపత్రుల్లో గా యా లతో కొన ఊపిరితో ఉన్న వారిని చూసి కన్నతల్లి దం డ్రుల రోదనలు ఆపడం ఎవరి తరం కావడం లేదు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు రాత్రులు పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



ఆసుపత్రి వద్ద గుమ్మిగూడిన జనం

కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం : రూరల్ ఎమ్మెల్యే

ఇందల్‌వాయి, జనవరి 30:కాంగ్రెస్ పార్టీతోనే పేద మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరుగుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని గౌరారం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయనకు మహిళలు మంగళహారతులు, బోనాలు, వల గొడుగుతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వంద రోజుల్లోనే అమలు చేస్తుందని, 50రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను విడతల వారిగా అన్ని పరిష్కరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో అభయహస్తం ద్వారా ధరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్దిదారునికి పథకాలు అందే విధంగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. రానున్న ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని, గత ప్రభుత్వంలోని నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. మిషన్‌భగీరథ పథకం ద్వారా తెస్తున్న నీటిని గ్రామాల్లో ఏ ఒక్కరు తాగడం లేదని విమర్శించారు. గౌరారం గ్రామంలో 180సర్వే నంబరులో గల భూములకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామంలోని రెండు చెక్‌డ్యాములకు ప్రతిపాదనలు పంపామని వాటికి త్వరలోనే నిర్మాణ పనులు చేపడ్తామన్నారు. కుల సంఘాలకు భవన నిర్మాణాలకు కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యేకు ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి గ్రామాభివృద్ధి సభ్యులు శాలువ పూలమాల లతో ఘనంగా సన్మానించారు. పాలక వర్గం పదవి కాలం త్వరలోనే ముగియనుండడంతో పాలక వర్గం సభ్యులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమోంటోలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్పాగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, వెంకటరెడ్డి, సంతోష్‌రెడ్డి, సుధాకర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



.సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బాల్కొండలో వీడ్కోలు సమావేశం

ముప్కాల్, జనవరి30: నేటితో పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియనుడడంతో మంగళవారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులను ఘనంగా సత్కరిం చారు. అంతకు ముందు మహాత్మగాంధీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, కార్య దర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ పట్టివేత

మోస్రా,జనవరి30: మోస్రా మండలంలోని చే నెంబర్ తండాలో అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, ఒక జేసీబీని పట్టుకుని సీజ్ చేశారు. టిప్పర్లు, జేసీబీని వర్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ కృష్ణ కుమార్‌ను వివరణ కోరగా జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని తమకు అప్పగించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సాయిలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ముప్కాల్, జనవరి30: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన పిల్లి సంజయ్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్ ఈనెల 26న బాల్కొండ క్రీడా మైదానంలో పడిపోగా మంగళవారం ఎస్సై గోపిబాధితునికి అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోరీకి గురైన ఫోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, జనవరి30: సైబర్ నేరాట పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సైతిరుపతి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో సైబర్ నేరాలు, గంజాయి, ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై సీహెచ్.తిరుపతి యువకులకు, గ్రామస్థు లకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఎంపీ సీట్లను గెలుచుకోవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి30: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎంపీ సీట్లు అధికంగా గెలుచుకోవాలని ఇందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న క్లస్టర్ యాత్ర సన్నహక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ప్రదీప్‌కుమార్, యాత్ర ప్రముఖ్ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల మీదుగా త్వరలో జరిగే బస్సు యాత్ర, పార్టీ బలోపేతంపై దృష్టి సారించి బూత్ స్థాయి నుంచి ప్రతీఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు, వివిధ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, కన్వీనర్‌లు, కోకన్వీనర్‌లు, పాల్గొన్నారు.

చెరువులో మునిగి బాలుడి మృతి

ఇందల్‌వాయి,జనవరి 30:పోలీసు స్టేషన్ పరిధిలోని మేగ్యానాయక్ తండాకు చెందిన శ్రీనాథ్(16)అనే బాలుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. సోమవారం పశువులు మేపేందుకు నల్లవెల్లి గ్రామ శివారులోని తిరుమలయ్య చెరువు వద్దకు వెళ్లిన శ్రీనాథ్ సరదాగా చేపలు పట్టేందుకు చెరువులోకి దిగగా జేసీబీ ద్వారా తీసిన గుంతలో బాలుడు అదృశ్యమయ్యాడని విషయం తెలుసుకున్న స్థానికులు చెరువు వద్ద గాలించగా బాలుడి ఆచూకీ లభించక పోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లను పిలిపించి రాత్రి పది గంటల వరకు గాలించగా శ్రీనాథ్ మృతదేహం లభించిందని,మృతదేహాన్ని పంచనామ నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడు శ్రీనాథ్ ఇంటర్ చదువుతున్నట్లు తెలిసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. బాలుడి అంత్యక్రియలను మేగ్యా నాయక్‌తాండలో నిర్వహించారు.

చెన్నై వెళ్లిన ఎస్ఎఫ్ఐ బృందం

నిజామాబాద్అర్బన్, జనవరి 30:దక్షిణాది రాష్ట్రాల్లో నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా బృందం మంగళవారం చెన్నై బయలుదేరింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాదర్శి అనిల్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అనేక ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఇది విపత్తుగా మారిందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ప్రైవేటీకరణకు, కార్పోరేటీకరణకు వత్తాసు పలుకుతుందన్నారు. దేశవ్యాప్తంగా 16విద్యార్థి సంఘాలు జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కెటాయించాలన్నారు. చెన్నై వెళ్లిన వారిలో నాయకులు నాగరాజు, మహేష్, దీపిక, వేణు, జవహర్, పూజ తదితరులు ఉన్నారు.

అమీర్‌నగర్‌లో 9వ తరగతి ప్రారంభం

కమ్మర్‌పల్లి జనవరి 30: మండంలోని అమీర్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఉన్నతపాఠశాలగా మారుస్తు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నుంచి అనుమతులు రావడంతో మంగళవారం పాఠశాలలో 9వ తరగతిని మండల విద్యాశాఖ అధికారి ఎన్ ఆంధ్రయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పాల గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేల్ల శ్రీనివాస్, వీడీసీ గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రీడలో గెలుపోటములను సహజం

గాంధారి, జనవరి 30: క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని ఓడిపో యిన వాళ్ల నిరాశ చెందకుండా గెలుపు కోసం కృషిచేయాలని మెదక్ డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాలీ బాల్ టోర్నమెంట్‌లో ప్రథమ విజేతగా నిలిచిన తాడ్వాయి జట్టును అభి నందించి రూ.30 వేల నగదును అందించారు. రెండో బహుమతి గాంధారి మండలం వెనుకతండా రూ.20 వేల నగదును అందించారు. మూడో బహు మతి మోతె వాలీబాల్ క్రీడాకారులకు రూ.10 వేలు అందించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వాలిబాల్ లాంటి క్రీడాలకు క్రీడాకారులకు ప్రో త్సాహం రానున్న రోజుల్లో వాలిబాల్ క్రీడల్లో మన జహీరాబాద్ పార్లమెంట్ నుండి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిం చాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో బాగారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో అనేకసేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఆర్మూర్‌టౌన్,జనవరి30: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో హనుమాన్ మం దిరంలో ఆలయ కమటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ చాలిసా పారా యణం చేశారు. కాలనీవాసులు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి జై హనుమాన్ అని నినాదాలు చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్‌కుమార్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, నర్సయ్య, భూమయ్య, శంకర్, ఎల్‌టి.కుమార్, సాయన్న, జీవన్, ముత్తెన్న, రవి, సాయిలు, నారాయణ, తదిత రులు పాల్గొన్నారు.

సుద్దులంలో ఉచిత పశువైద్య శిబిరం

కోటగిరి,జనవరి30: కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సాయిలు ప్రారంభించారు. పశువైద్య శిబిరంలో 8పశువులకు గర్భ నిర్ధారణ, 14 పశువులకు గర్భకోశ చికిత్సలు, 40పశువులకు సాధారణ చికిత్సలు, 32దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రెబీస్ టీకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధిక, పశువైద్యులు సురేష్ కుమార్, సంతోష్, జూనియర్ డాక్టర్లు సిబ్బంది, గోపాల మిత్ర పర్యవేక్షకులు గోపాల మిత్రలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్అర్బన్, జనవరి 30:గల్ఫ్ కార్మికుల సమస్యలు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతును కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని గల్ఫ్ కార్మికుల సమస్యలు, నఖిలీ ఏజెంట్లు గల్ఫ్‌కార్మికులను మోసం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అసోసియేషన్‌తో సంబంధం ఉన్న ఏజెంట్ల ద్వారానే వీసాలను ధరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు పోశెట్టి, కార్యదర్శి విజయరావ్, ఉపాధ్యాక్షుడు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదు'

బిచ్కుంద, జనవరి 30: ప్రజా ఆశీర్వాదంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లిఖార్జున్ అప్పశెట్కార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రెండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై నోటికొచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదని 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోని ఏ ఒక్క హామీని కూడా అమలు పరిచలేదని అన్నారు. వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గంలో 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యే అయి ఉండి డబుల్‌బెడ్‌రూంలు ఎందుకు కట్టలేదో చెప్పాలని గొప్పల కోసం బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకలకు మార్చారని వైద్యులు సిబ్బందిని మాత్రం మంజూరు చేయించలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యేరోడ్డు లేని గ్రామాల పరిశీలనకు రావాలన్నారు. చాలావరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే రోడ్లు, ప్రభుత్వ భవనాలు, తాగునీటి సౌకర్యాల ట్యాంకులు నిర్మాణం చేసినవి ఉన్నాయని వాటికి రంగులు పూసి మిషన్ భగీరథ అని పేర్లురాసుకోవడం సిగ్గుచేటు అన్నారు.బిచ్కుంద పట్టణంలో ఎన్నికలకు ముందు ఓట్లకోసం అగ్రిమెంట్ కాకుండా సెంట్రల్ లైటింగ్ పనుల కోసం అంటూ దుకాణ సముదాయాల ముందు రోడ్లను తవ్వకాలు జరిపి అర్ధాంతరంగా నిలిపివేయడంతో రోడ్డుపై విపరీతంగా దుమ్ములేచి ప్రజలకు ఇబ్బంది పడుతున్నట్లు ఆయన విమర్శించారు. ఇబ్బందికరమైన మాటలను మానుకొని అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్రాంరెడ్డి, నాగనాథ్, కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షుడు గంగాధర్, నౌషానాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నేడు నాగిరెడ్డిపేటలో పలు ప్రారంభోత్సవాలు

నాగిరెడ్డిపేట, జనవరి 30: మండలంలో బుధవారం ఉదయం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు మండలంలోని బొల్లారం గ్రామంలో కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆయన ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం బొల్లారం, వెంకంపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీ ద్వారా ఒక్కొక్క గ్రామ పంచాయతీకి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీణ ధనుంజయ్, శ్రీధర్‌గౌడ్, సుభాకర్‌రెడ్డిలు తెలిపారు.

గాంధారి: మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే బుధవారం వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

బాల కార్మికులతో పనులు చేయిస్తే కేసులు

పిట్లం, జనవరి 30: బాల కార్మికులను పనులలో పెట్టుకుంటే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ నరేష్ అన్నారు. మంగళవారం వ్యాపార సముదాయాల్లో 14 సంవత్సరాలు నిండని పిల్లలు పనులు చేస్తుండడంతో డిప్యూటీ తహసీల్దార్ స్పందించారు. విద్యాహక్కు చట్టం కింద పిల్లలను పనులలో పెట్టుకొని వెట్టిచాకిరి చేయిస్తే కేసులు నమోదు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండని పిల్లలతో వ్యాపారులు, హోటల్, మెకానిక్ దుకాణాల్లో పనులు చేయిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా చిన్న పిల్లలను పనులలో పెట్టకుండా పాఠశాలలకు పంపాలని సూచించారు.



సర్పంచ్, సెక్రెటరీలకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

బీర్కూర్, జనవరి 30: హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన యువకులు మంగళవారం గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామ యువకులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు బరంగేడ్గి డాబా వద్ద ప్రధాన రహదారి పక్కన విగ్రహం ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామన్నారు. గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్, గ్రామ సెక్రెటరీలు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ అధ్యక్షుడు గంగాధర్, సతీష్, వినోద్‌కుమార్, మల్లేష్, నవీన్, సాయిబాబా, ప్రవీణ్, బాలాజీ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ ఏకలవ్య శిక్షణలో

బాన్సువాడ రిపుల్స్ పాఠశాల బృందం



ప్రొ. సునీల్‌మండాతో బాన్సువాడ రిపుల్స్ పాఠశాల బృందం

బాన్సువాడ టౌన్, జనవరి 30: ఏకలవ్య ఫౌండేషన్ గుజరాత్ వారు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి దేశంలోనే అత్యుత్తమ పాఠశాలలను ఎంపిక చేయడం జరిగింది. అందులో బాన్సువాడ పట్టణంలోని రిపుల్స్ పాఠశాల బృందం ఎంపికయ్యారు. ఏకలవ్య పాఠశాల సందర్శన , శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల బృందం అడ్వాన్స్‌డ్ స్కూల్ లీడర్‌షిప్ స్కిల్స్, ఎక్సలెంట్ ఎడ్యుకేషన్ ప్రణాళికలను నేర్చుకోవడం జరిగిందని పాఠశాల వ్యవస్థాపకుడు అనిల్ పాటిల్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయుడు యజ్ఞ, మాయ తదితరులున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బీబీపేట, జనవరి 30: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బాలమణి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ పూర్తి నివేదికలతో సమయపాలన పాటించి సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

పిట్లం, జనవరి 30: మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం ఎంపీడీవో వెంకటేశం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలతో పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ముందుగా పనులు గ్రామాల్లో పనులు గుర్తించి చేయించాలని, హాజరు పట్టికలలో సక్రమంగా పనులకు వచ్చే వారి పేర్లు హాజరువేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఆయన వెంట ఏపీవో శివకుమార్ ఉన్నారు.

ఇంద్రజాలికుడు సంతోష్‌కు అవార్డు

భిక్కనూరు, జనవరి 30: నిర్మల్ జిల్లా లోకేశ్వరంలో నిర్వహించిన అమ్మనాన్న ఫౌండేషన్ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు కుమ్మరి సంతోష్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్రస్థాయి అవార్డును మంగళవారం ప్రదానం చేశారు. అనంతరం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ.. అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు, సాయి అనాథశ్రమం చైర్మన్ అశోక్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

బాన్సువాడ టౌన్, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని బాన్సువాడ పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీచౌక్‌లో గల గాంధీజీ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రైతుబంధు అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి మాట్లాడుతూ మహాత్ముడు అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకవచ్చారన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలని, శాంతిని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏజాస్, ఏఎంసీ వైస్ చైర్మెన్ బుల్లెట్ రాజు, కౌన్సిలర్లు వెంకటేశ్, మోతీలాల్, నాయకులు హకీం, రాజశేఖర్, రఫీ తదితరులున్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి గాంధీ చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్, మాజీ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బసవరాజ్ పటేల్, సొసైటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

పిట్లం: మండల కేంద్రంలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు బోడ్ల రాజు, విజయ్, ప్రసాద్, రాములు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లో ఉన్న గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, టీయూ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు రామస్వామిగౌడ్, సీతారాం మధు, శ్రీకాంత్, గోపాల్‌రెడ్డి, లింగం, రాజేశ్వర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు



రామేశ్వర్‌పల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమ సమయంలో మహాత్మాగాంధీ చేపట్టిన ఉద్యమాలు, ఆయన చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్, పాఠశాల సిబ్బంది మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెన్న లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ గాయజోద్దిన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, ఆజార్ ఖాద్రీ, విద్యాసాగర్, ఈశ్వర్ గౌడ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

బీర్కూర్, జనవరి 30: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేద్రం చుట్టూ గతంలో నిర్మించిన ప్రహరీ శిథిలావస్థకు చేరుకుని కూలిందని తెలిపారు. దీంతో పందులు, కుక్కలు లాంటి జంతువులు లోనికి నేరుగా ప్రవేశిస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని 15 లక్షల నిధులతో కొత్తగా ప్రహరీ నిర్మించేందుకు పూనుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు, బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు శశికాంత్, కో ఆప్షన్ ఆరీఫ్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు అవారి గంగారాం, ఎంపీటీసీ సందీప్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దుంపల రాజు, గ్రామ పెద్దలు, టీఆర్ఎస్ నాయకులు మన్నన్, మాధవ్ యాదవ్, వెంకటేశం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ క్యాంపస్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

భిక్కనూరు, జనవరి 30: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ మొదటి సంవత్సరం విద్యార్థులు మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మపాని స్వచ్ఛంద సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ చేపడుతున్న సేవ కార్యక్రమాలను, తడి, పొడి పద్ధతిలో వరి సాగు విధానాన్ని సంస్థ ప్రతినిధులను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంస్థ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. సోషల్‌వర్క్ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, సంస్థ ప్రోగ్రాం మేనేజర్ వినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణకు అవగాహన సదస్సు

దోమకొండ, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జీడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు కుష్ఠువ్యాధిపై డిప్యూటీ పారామెడికల్ అధికారులు జీవన్, రాధకిషన్ అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధిని ఎలా నివారంచాలి, నివారాణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ పరికరాల వితరణ

మాచారెడ్డి, జనవరి 30: మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు రోటరి క్లబ్ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువగల సైన్స్ ల్యాబ్ పరికరాలను దాత,గురువిద్యాసంస్థల చైర్మన్ గురువేందర్‌రెడ్డి సహకారంతో అందించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు సత్యం మాట్లా డుతూ.. సైన్స్‌పరికరాలు విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుని ప్రాక్టికల్స్‌లో ఈ సైన్స్ ల్యాబ్ మెటిరియాల్‌తో ప్రయోగాలతో విజ్ఞాన శాస్త్రన్ని నేరుకుంటే శాశ్వతంగా మంచి జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, పౌండేషన్ చైర్మన్ కాశీనాథం, కాశీనాథరావు, గంగారెడ్డి,కృష్ణమూర్తి, లక్ష్మీపతి, గురువేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్‌రెడి, ఉపసర్పంచ్ జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ లావణ్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

పిట్లం, జనవరి 30: వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రతలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేశం కార్యదర్శులకు సూ చించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల కార్యదర్శులు, ఫీల్డ్‌అస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనులు గుర్తించి పనులు చేయించాలన్నారు. వేసవి కాలం కావడంతో తాగునీరు, నీడ వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్, మండల కార్యదర్శులు, పీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

నాగిరెడ్డిపేట, జనవరి 30: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కౌలు రైతు కుర్మ లక్ష్మయ్య (47) మంగళవారం సాయంత్రం పోలం వద్ద గడ్డి కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం పోచారం గ్రామానికి చెందిన కుర్మ లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన టేకులపల్లి గోపాల్ రెడ్డి వద్ద సాగు భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మంగళవారం వరి పంట పొలం వద్ద కలుపు తీత పనులు జరుగుతుండగా, తాను మిషన్‌తో గట్టుపైన గడ్డి కోస్తున్న క్రమంలో ప్రమావశాత్తు విద్యుత్తు వైర్ కాలుకు తగిలి కరెంట్ షాక్ తగలడంతో లక్ష్మయ్య తీవ్రంగా గాయపడి కింద పడిపోయాడు. పొలం వద్ద పనిచేస్తున్న కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరిశీలించి లక్ష్మయ్య మృతి చెందినట్టు నిర్ధారించినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల అహ్వానం

లింగంపేట, జనవరి 30: తెలంగాణ గురుకుల విద్యాసంస్థల ఆద్వర్యంలో నిర్వహించబడుతున్న గురుకుల కళాశాలలకు 2024-25 సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశపరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కోఆర్డినేటర్ తారాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పోచంపాడ్ బాలుర, మద్నూర్ బాలుర, సర్వేలు బాలుర, పోచంపాడు బాలికల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, ఇంగ్లీష్ మీడియం కోర్సులకు ప్రస్తుతం పదవతరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు మార్చి 16వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల కృషి మరువలేనిది

భిక్కనూరు, జనవరి 30: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల కృషి మరువలేనిదని భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం భిక్కనూరు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్‌లు కరోనా సమయంలో ఇబ్బందులు ఉన్న గామాభివృద్ధికి చాలా కృషిచేశారన్నారు. ఇప్పటికి చాలామందికి చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకా ఇబ్బందులు పడుతున్న గ్రామాల అభివృద్ధికి పోటిపడి పనిచేశారన్నారు. అనంతరం ఎంపీడీవో గోపాల్‌రావు, ఎంపీపీ ప్రవీణకుమార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతగానో సహకరించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తిప్పాపూర్, జంగంపల్లి, అంతంపల్లి, మోటాట్‌పల్లి గ్రామాలను రాజంపేట పిహెచ్‌సీ పరిధి నుండి భిక్కనూరు పరిదిలో కలపాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. కాగా సర్పంచ్‌లను ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖ అధికారులు పాల్గొన్నారు.



సిద్ధరామేశ్వరనగర్‌లో పెంపుడు కుక్కకు టీకాలు వేస్తున్న దృశ్యం

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలి

ఎల్లారెడ్డి, జనవరి 30: పెంపుడు కుక్కలు పెంచుకునే ప్రతి ఒక్కరు కుక్కలకు రెబీస్ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఎల్లారెడ్డి పశువైద్యాధికారి సుభాష్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పశువైద్యశాలలో 17 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మత్తమాల పశు వైద్యాధికారిణి అర్పన రెడ్డి, సిబ్బంది సవిత, రమేష్, కరీం తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: పెంపుడు కుక్కలకు యాజమానులు తప్పకుండా యాంటీ రాబిస్ టీకాలను వేయించాలని భిక్కనూరు పశువైద్యాధికారి దేవేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో జంతుసంక్షేమ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు జంతు వుల పట్ల ప్రేమకలిగి ఉండాలని సూచించారు. ప్రతి సంవత్సరం జంతు సంక్షేమ పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిసం వత్సరం క్రమం తప్పకుండా ఈ టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జనగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పాపూర్ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

భిక్కనూరు, జనవరి 30: మండలంలోని తిప్పాపూర్ గ్రామ సర్పంచ్ స్వామి మంగళవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ స్వామికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొన్నిరోజులే అవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అనేక మంచి కార్యక్రమాలను చేపడుతున్నారని, రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు నచ్చి కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగిందన్నారు. తిరిగి కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపరి భీంరెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ చిట్టెడి సుధాకర్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, ధర్మయ్య పాల్గొన్నారు.

తండాలలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

తాడ్వాయి, జనవరి 30: మండలంలోని నందివాడ పరిధిలోని పల్లెగడ్డ తండా, సామ దుబ్బ తండా, పిరుమాయకుంట తండాల్లో మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండాల్లో ఎక్కడైన గుడుంబా కాస్తున్నారా, గంజాయి మొక్కలు పెంచుతున్నారా అనే విషయమై తనిఖీ చేసినట్లు దోమకొండ ఎక్సైజ్ సీఐ మదనూదన్ రావు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎక్కడ నాటుసారాకు తావులేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. తండాలలో నాటుసారా కాసిన, గంజాయి సరాఫరా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు తండాల్లో ఎక్కడ నాటు సారా కాని, గంజాయి ఆనవాళ్లు కాని కనిపించలేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శ్రావణ్, ఏరియా కానిస్టేబుల్ జీవన్, సిబ్బంది బాలరాజు, మహేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

దోమకొండ, జనవరి 30: మద్యం తాగి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పోలీసులకు పట్టుబడిన దోమకొండకు చెందిన పాషా, అంచనూర్ గ్రామానికి చెందిన రాజమల్లు అనే ఇద్దరు వ్యక్తులకు మంగళవారం కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయాధికారి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

26/4 ఉప కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

● ఇరిగేషన్ డిప్టీ జగదీష్

బీర్కూర్, జనవరి 30: బీర్కూర్ శివారులోని పంట పొలాలకు సాగునీరు అందించేందుకు 26/4 ఉప కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఇరిగేషన్ డిప్టీ జగదీష్ తెలిపారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులతో కలిసి 26/4 ఉప కాలువ, పంట కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ కార్యదర్శి బస్వరాజు పటేల్ మాట్లాడుతూ నిజాం సాగర్ ప్రధాన కాలువ నిండుగా పారుతున్నా బీర్కూర్ శివారులోని పంట పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 26/4 ఉప కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించారని, అంతలోనే ప్రభుత్వం మారిపోవడంతో కాలువ నిర్మాణం కాలేదన్నారు. దీంతో రైతులు సాగునీటి కోసం దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. తాము రైతుల సమస్యలను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరామని అన్నారు. కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ డిప్టీ జగదీస్ 26/4 ఉప కాలువ, పంట కాలువలను పరిశీలించారని అన్నారు. ఈ సందర్భంగా డిప్టీ జగదీష్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా కాలువ నిర్మాణం ఎలా చేబడితే బాగుంటుందో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలని అన్నారు. త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. నిధులు మంజూరు అయ్యాక కాలువ పనులు చేపడతామన్నారు. కాలువ నిర్మాణం పూర్తి అయితే బీర్కూర్ గ్రామ శివారులోని చెరువులన్నీ కళకళలాడుతాయని, 4వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని రైతులు పేర్కొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన

ధరలకే ఎరువులను విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ



పద్మాజీవాడి సహకార సంఘంలో తనిఖీ నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మీ

సదాశివనగర్, జనవరి 30: ప్రభుత్వం సూచించిన ధరల ప్రకారం మాత్రమే ఎరువులను విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారిని భాగ్యలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్ తప్పకుండా నిర్వహించాలని అమ్మిన సరుకు స్టాక్ ఉన్న సరుకు స్పష్టంగా తెలియచేసే సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకునకిలి విత్తనాలు,నకిలి ఎరువులు అమ్మినట్లయితే వారి లైసెన్స్‌లు రద్దుచేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు రికార్డులను ఎరువుల అమ్మకాల రిజిస్టర్‌లను క్షుణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రజాపతి, సొసైటీల చైర్మన్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- క్యాప్టెన్ మిల్లర్
ప్రియా 35	- అయాలన్

బాన్సువాడ

మహేశ్వరి	- సైంధవ్
వెంకటేశ్వర	- నా సామిరంగ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

